
## ఫోర్త్ సిటీ.. ఫ్యూచర్ ట్రేడింగ్?



## ఎంతెంత దూరం.. ఎవరెవరికి లాభం?

రంగారెడ్డి జిల్లా అమన్‌గల్ నుంచి మాడ్గుల వరకు పాత అలైన్‌మెంట్‌లో అత్యంత కీలకమైన మార్పు జరిగింది. గత అలైన్‌మెంట్.. మాడ్గుల మండలంలోని కొలుకులపల్లి-బ్రాహ్మణపల్లి-నర్సాయిపల్లి-పెద్ద మాడ్గుల-అప్పారెడ్డిపల్లి మీదుగా అమన్‌గల్ మండలంలోని విఠాయిపల్లి నుంచి వెళ్లింది. కానీ తాజా అలైన్‌మెంట్ మాత్రం మాడ్గుల మండలంలోని అన్నబోయినపల్లి- బ్రాహ్మణపల్లి-నల్లచెరువు-మాడ్గుల-సింగంపల్లి మీదుగా అమన్‌గల్ మండలంలోని మేడిగడ్డ తండా నుంచి వెళ్తుంది. ఇలా పాత దానికి ఇప్పటిదానికి మధ్య 3-4 కిలోమీటర్ల దూరం పెంచారు.

*నల్లచెరువు సమీపంలో ప్రభుత్వ 'పెద్ద' అత్తగారి కుటుంబానికి చెందిన వారి భూములు పెద్దఎత్తున ఉన్నాయి. ఇవి సుమారు 200 ఎకరాలకు పైబడే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. ఈ భూములకు కేవలం కిలోమీటరు లోపు దూరం నుంచే ట్రిపుల్ రహదారి వెళ్లేలా అలైన్‌మెంట్ మార్పు చేశారు.*

రంగారెడ్డి జిల్లా చుక్కాపూర్ సమీపంలో నుంచి ట్రిపుల్ ఆర్ గత అలైన్‌మెంట్ ప్రాథమికంగా నిర్ధారించారు. కానీ ఇప్పుడు దానిని 3-4 కిలోమీటర్ల దూరం అవతలికి జరిపారు. తద్వారా కొత్త అలైన్‌మెంట్ ఖానాపూర్ గ్రామ సమీపంలో నుంచి వెళ్లనుంది.

*ఖానాపూర్ గ్రామం ప్రస్తుత ఎమ్మెల్యే స్వగ్రామం. వీరి కుటుంబానికి ఇక్కడ వంద ఎకరాలకు పైబడి భూములు ఉన్నాయి. తద్వారా ఈ భూములకు కిలోమీటరు లోపు దూరం నుంచే ట్రిపుల్ ఆర్ వెళుతున్నదని స్థానికులు తెలిపారు.*

రంగారెడ్డి-వికారాబాద్ జిల్లా సరిహద్దులో నుంచి పాత అలైన్‌మెంట్ ప్రకారం రింగు రోడ్డు అంగడిచిట్టంపల్లి- పూలపల్లి-గంగ్యాడ- ముబారక్‌పూర్ మీదుగా వెళ్లింది. కానీ తాజా మార్పుతో కనకల్-మేడిపల్లి కలాన్-కుత్బుల్లాపూర్-మన్నెగూడ మీదుగా వెళ్లనుంది. ఇక్కడ కూడా 3-5 కిలోమీటర్ల మేర రంగారెడ్డి జిల్లా నుంచి వికారాబాద్ వైపునకు అలైన్‌మెంట్‌ను మార్చారు.

*ఈ ప్రాంతంలోనే కొన్ని నెలలుగా భారీ ఎత్తున భూములు చేతులు మారినట్టు తెలుస్తున్నది. పార్లమెంటు ఎన్నికల సమయంలోనే బీఆర్ఎస్‌లో నుంచి కాంగ్రెస్‌కు వెళ్లిన ఒక మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ, మాజీ మంత్రి ఒకరు, ప్రభుత్వ పెద్ద సోదరుడు మరొకరు.. ఇలా ముగ్గురు ఇందులో కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. ఆ క్రమంలోనే అలైన్‌మెంట్ ఈ భూముల వైపు వచ్చినట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా పాత అలైన్‌మెంట్ ప్రకారమైతే మాజీ ఎంపీ భూముల్లో నుంచి రింగు రోడ్డు వెళ్లేదని, కానీ తాజా మార్పుతో ఆ భూములు సేఫ్ కావడంతోపాటు సమీపంలో నుంచే రింగు రోడ్డు వెళుతుండటంతో వాటికి డిమాండ్ భారీగా పెరగనుందని స్థానిక ప్రజాప్రతినిధి ఒకరు తెలిపారు.*

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామ సమీపంలో నుంచి గతంలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను ప్రాథమికంగా నిర్ధారించారు. కానీ తాజా మార్పులతో అది చెంగోముల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నుంచి అంతారం గ్రామ పరిసరాల్లో నుంచి ప్రతిపాదించారు. ఈ మేరకు హద్దును నిర్ధారిస్తూ మార్క్ కూడా వేశారు.

*దీనిపై అంతారం గ్రామం భగ్గుమంటున్నది. మాజీ ఎంపీ ఒకరి భూముల ప్రయోజనం కోసమే ఈ మార్పు చేశారంటూ గ్రామస్తులు చెప్తున్నారు. సదరు మాజీ ఎంపీకి ఇక్కడ ఏకంగా నాలుగు వందల ఎకరాలకు పైగా భూములు ఉన్నాయని వారంటున్నారు. గతంలో ఆ భూముల అవతలి వైపు నుంచి అర కిలోమీటరు దూరంలో అలైన్‌మెంట్ ఉండేదని, ఇప్పుడు భూములకు ఇటువైపు మార్చారని, తన భూమిలో గుంట భూమికీ నష్టం వాటిల్లకుండా పక్కనుంచే అలైన్‌మెంట్‌ను ఖరారు చేయించుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.*

# రీజినల్ రింగ్ మాస్టర్లు!

మొదటిపేజీ తరువాయి...

వందల ఎకరాలు ఉన్నచోట అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు జరగడం కలకలం రేపుతున్నది. ఈ నేపథ్యంలో గత అలైన్‌మెంట్‌లో సర్కారు భూముల నుంచి వెళ్లిన రింగు రోడ్డు.. ఇప్పుడు సన్న, చిన్నకారు రైతుల కొద్దిపాటి భూములనుంచే పోతున్నది. దీంతో క్షేత్రస్థాయిలో మార్పులకు అనుగుణంగా అధికారులు సర్వే నిర్వహించి, గుర్తులు వేస్తుండటంతో వివిధ గ్రామాల రైతులకు కంటిమీద కునుకు కరువైంది. 'నమస్తే తెలంగాణ' బుధవారం 'రూటు మారిన ట్రిపుల్ ఆర్' శీర్షికన ప్రచురించిన కథనాన్ని చూసి అనేకమంది రైతులు ఆందోళనతో ఫోన్లు చేశారు. పెద్దోళ్ల భూముల కోసం తమకున్న ఒకటీరెండు ఎకరాలను గుంజుకొని రోడ్డు వేయాలని చూస్తున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. కొన్నిచోట్ల రైతులు మూకుమ్మడిగా సర్కారు పెద్దలపై దుమ్మెత్తిపోస్తుండగా... మరికొన్నిచోట్ల ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

### మార్పుల వెనుక మాయ

హైదరాబాద్ మహానగరం చుట్టూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అలైన్‌మెంట్ దాదాపుగా ఖరారైన ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి... అలైన్‌మెంట్ ఖరారుకు గుర్తులు కూడా పెట్టారు. దీంతో గతంలో 189 కిలోమీటర్ల పొడవుగా ఉన్న దక్షిణ భాగం రింగురోడ్డు ఐదు కిలోమీటర్లు పెరిగి 194 కిలోమీటర్లకు చేరింది. ముఖ్యంగా ఆమన్‌గల్, చేవెళ్ల ప్రాంతంలోనే దాదాపు 2-5 కిలోమీటర్ల వరకు అలైన్‌మెంట్‌ను అవతలికి జరిగింది. పాత అలైన్‌మెంట్‌లో మార్పులను గుట్టుచపుడు కాకుండా చేయడంతోపాటు.. వాటిని బయటకు చెప్పొద్దంటూ అధికారులకు సైతం హుకుం జారీ చేశారు. అక్కడంతగా ఏమీ లేకపోతే.. ఎందుకీ గోప్యత? ఈ క్రమంలో పలుచోట్ల అలైన్‌మెంట్ మార్పు వల్ల ఎవరికి ప్రయోజనం జరిగిందనే దానిపై 'నమస్తే తెలంగాణ' సమాచారం సేకరించింది. వందల ఎకరాల ప్రభుత్వ, కాంగ్రెస్ పెద్దల భూములకు ప్రయోజనం చేకూర్చేందుకే 'రింగు' తిరిగినట్లుగా తెలుస్తున్నది.

### వరల్డ్ బ్యాంక్ బాట అందుకేనా?!

**ఉమ్మడి** ఆంధ్రప్రదేశ్‌లోనే ట్రిపుల్ ఆర్ ప్రతిపాదన ఉన్నా.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టు పట్టాలెక్కింది. ఆది నుంచీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు నిర్ణయించిన దరిమిలా గతంలోనే మోదీ సర్కారు భారత్‌మాల కింద ప్రాజెక్టును ప్రకటించింది. అందుకు అనుగుణంగా ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగం అలైన్‌మెంట్ నిర్ధారణ, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నది. కానీ ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వం ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగాన్ని మాత్రం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వపరంగానే చేపట్టేందుకు అడుగులు వేస్తున్నట్టు సమాచారం. భూసేకరణ సహా ఈ ప్రాజెక్టుకు అటుఇటుగా రూ.15 వేల కోట్ల వరకు అవుతుందని అంచనా. ఈ మేరకు ప్రపంచబ్యాంకు రుణం తీసుకుని పీపీపీ విధానంలో చేపట్టాలని భావిస్తున్నట్టు ప్రాథమికంగా తెలుస్తున్నది. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకుపోవాలి. అదే జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా అలైన్‌మెంట్ మార్చేందుకు కేంద్రం అంగీకరించదు. పైగా ఒక్కసారి కేంద్రం అలైన్‌మెంట్‌ను ఆమోదించిన తర్వాత తదుపరి మార్చేందుకు కూడా అవకాశం ఉండదు. అందుకే ఈ అలైన్‌మెంట్ల మార్పు తన ఇష్టానుసారంగా చేసేందుకే పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టేందుకు సిద్ధమైనట్టుగా తెలుస్తున్నది. తద్వారా తమకు నచ్చినట్లుగా అలైన్‌మెంట్ మార్చినా నడుస్తుందనేది ప్రభుత్వ పెద్దల యోచనగా ఉన్నట్టు తెలుస్తుంది. ఒకవేళ కేంద్రం సహకారం తీసుకుంటే పర్యవేక్షణ, అలైన్‌మెంట్లలో మార్పులోని అసలు గుట్టు బయటపడుతుందనే ఉద్దేశంతోనే ప్రపంచ బ్యాంకు బాట పట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంటే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్లలో మార్పులు ఇంతటితో ఐపోలేదు. మున్ముందు మరిన్ని మార్పులు చేర్పులు ఉండనున్నట్టు స్పష్టమవుతున్నది.



### పూడూరు కేంద్రంగా కాంగ్రెస్ నేతల ల్యాండ్ బ్యాంక్!

**ఈ అలైన్‌మెంట్** మార్పులో కీలకంగా చేవెళ్ల సమీపంలో నుంచి మన్నెగూడ సమీపంలోకి మార్చడం వల్ల మరికొంతమంది ప్రభుత్వ, కాంగ్రెస్ పెద్దల భూములకు ప్రయోజనం కలుగుతుందనేది సుస్పష్టం. ఇందుకు పూడూరు కేంద్రంగా ఉన్న ల్యాండ్ బ్యాంకే నిదర్శనం. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీలో అత్యంత సీనియర్, అనేకపర్యాయాలు మంత్రిగా చేసిన ఓ నేత, వికారాబాద్ జిల్లాకు చెందిన ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే, ఇటీవల కూతురుతో సహా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఒక మాజీ ఎంపీ, నల్గొండ జిల్లా ప్రస్తుత సూర్యాపేట జిల్లాకు చెందిన ఒక మంత్రి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఒక ఎమ్మెల్సీకి చెందిన భూములు భారీ ఎత్తున ఉన్నట్టు తెలిసింది.



బుధవారం తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బాల్కసుమన్. చిత్రంలో దాసోజు శ్రవణ్, నోముల భగత్

# ఫ్యూచర్ సిటీ 'రియల్' దందా

- కాంగ్రెస్ పాలనలో తెలంగాణ 20 ఏండ్లు వెనక్కి
- ఇందిరమ్మ రాజ్యంలో హైడ్రా పేరు చెప్పి వసూళ్లు
- ఫేక్ న్యూస్ ప్రచారకులను వదలం: బాల్క సుమన్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం 20 ఏండ్లు వెనక్కి వెళ్లిందని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో అవినీతి, కుటుంబ పాలన, దందాలు నడుస్తున్నాయని.. హైడ్రా పేరుతో భయపెట్టి వసూళ్లకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ అని మండిపడ్డారు. సినీనటుడు నాగార్జున ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టిన హైడ్రా.. హిమాయత్‌సాగర్‌లోని ఆనంద్ కన్వెన్షన్‌ను ఎందుకు కూల్చటం లేదని ప్రశ్నించారు. నాగార్జునను రూ.400 కోట్లు డిమాండ్ చేశారని, ఇవ్వనందుకే ఎన్ కన్వెన్షన్ కూల్చారని సినీ ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయని వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ 18 ఎకరాల ఫాంహౌస్ కూల్చడానికి బుల్డోజర్లు దొరకటం లేదా? అని నిలదీశారు. కాంగ్రెస్ నేతల ఫాంహౌజ్‌లు కూల్చబోరని, పేదల ఇండ్లు మాత్రమే కూల్చుతారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన నడవటం లేదని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులపై రాహుల్‌గాంధీది ఒక విధానం, రేవంత్‌రెడ్డికి ఇంకో విధానం అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు కావొస్తున్నా మ్యానిఫెస్టో హామీల అమలుపై దృష్టిపెట్టడం లేదని విమర్శించారు. 'మ్యానిఫెస్టో అంశాలు చర్చకు రాకుండా ప్రజల దృష్టి మళ్లించే పనిలో సీఎం బిజీగా ఉన్నారు. 9 నెలలైనా ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదు. రుణమాఫీ చేసింది రూ.17,933 కోట్లే. ఎంతమంది రైతుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయనేది ఇంతవరకు ప్రకటించలేదు. వానకాలం ముగియవస్తున్నా రైతుబంధు పడలేదు. రాష్ట్రంలో సునీల్ కనుగోలు స్క్రిప్ట్ ప్రకారమే తిట్ల పురాణం, హైడ్రా డ్రామాలు నడిపిస్తున్నాయి' అని మండిపడ్డారు. ఇక, కేసీఆర్, కేటీఆర్‌తో పాటు తమ నాయకుల వ్యక్తిత్వాలపై సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌లు పెడుతున్నారని, రేవంత్ టీమ్‌లో ఉండి ఫేక్ న్యూస్‌లు పెడుతున్న వారిని కేసీఆర్, కేటీఆర్ వదిలిపెట్టినా తాను వదిలిపెట్టబోనని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నోముల భగత్, దాసోజు శ్రవణ్‌కుమార్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, చాడ కిషన్‌రెడ్డి, తుంగ బాలు, యాకుబ్ రెడ్డి పాల్గొన్నారు.

### గత ప్రభుత్వం చెప్పిన రోడ్డు వేస్తేనే మేలు



**గత** ప్రభుత్వంలో రింగ్‌రోడ్డు వేసేందుకు సర్వే చేపట్టిన విధంగానే ఇప్పుడు రోడ్డు వేస్తేనే మాకు మేలు జరుగుతుంది. లేకపోతే మా ఇండ్లతో పాటు భూములు పోతాయి. నాకున్న ఎకరం పొలంతో పాటు ఇల్లు కూడా రోడ్డులో పోయేలా కనిపిస్తున్నది. రూ.కోట్లు విలువ చేసే భూమితో పాటు రూ.లక్షలు ఖర్చుపెట్టి కట్టుకున్న ఇల్లు కూడా రోడ్డులో పోతే మమ్మల్ని ఎవరు పట్టించుకుంటారు.

**- సురేందర్, రైతు, అంతారం**

### వెంచర్ల కోసమే అలైన్‌మెంట్ మార్పు

**మాది** వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని పులిమామిడి. మా అన్నదమ్ములకు 14 ఎకరాల భూమి ఉన్నది. గతంలో త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మా గ్రామానికి పశ్చిమ వైపు నుంచి నిర్ధారించారు. దాని వల్ల రింగు రోడ్డు అంతా ప్రభుత్వ భూమిలోనే జరిగేది. ఏ ఒక్క రైతు కూడా నష్టపోయేవాడు కాదు. కానీ కొత్త అలైన్‌మెంట్‌ను రెండు కిలోమీటర్లు తూర్పు వైపునకు జరిపారు. దీంతో మా పద్నాలుగు ఎకరాల మధ్యలో నుంచి రోడ్డు పోతుంది. అంటే ఉన్న భూమి అంతా రోడ్డుకే పోతే మేం ఏం చేయాలి? మాదే కాదు.. చాలా మంది రైతులది ఇదే పరిస్థితి.

**- దేవనగరి భూపతిరెడ్డి, పులిమామిడి**

# పెద్దోళ్ల కోసం పేదోళ్లు బలి కావాల్నా?

*షాబాద్, సెప్టెంబర్ 18: 'మాకున్నది ఒకట్రెండు ఎకరాలు. అదే మాకు ఆధారం.. దానిని గుంజుకొని రింగు రోడ్డు వేస్తే మేం ఏం తిని బతకాలి? ప్రభుత్వం పైసలిచ్చినా రెండ్రోజుల్లో అవి ఖర్చయితయ్? ఆ తర్వాత మేమెట్ల బతకాలి? ఉన్నోళ్లకు వందల ఎకరాలు ఉన్నయి. అందులో నుంచి రోడ్డు వేయకుండా.. మా భూముల్ల గుర్తులు పెడతరా? ఇదంతా మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి చేసిన పనే. కాంగ్రెస్‌లోకి పోయిందే అందుకు...' అని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని అంతారం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన 'రూటు మారిన ట్రిపుల్ ఆర్' కథనం చూసి అనేక మంది ఫోన్ చేశారు. గ్రామానికి వస్తే తాము పడుతున్న ఆవేదన చెప్తామన్నారు. గతంలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ఆలూర్ మీదగా పోయేదని, ఇప్పుడు తమ గ్రామం నుంచి వేస్తున్నట్టుగా గుర్తులు పెట్టారని ఆందోళన వ్యక్తంచేశారు. అప్పటి నుంచి తిన్న తిండి ఒంటికి పడతలేదని వాపోయారు. అలైన్‌మెంట్ మార్పుతో దాదాపు 60 మంది రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే...*

### పాత మార్కింగ్ ప్రకారమే చేయాలి



ట్రిపుల్ ఆర్‌ను పాత మార్కింగ్ ప్రకారమే ఏర్పాటు చేయాలి. కొంత మంది కోసం కొత్తగా మార్కింగ్ చేయించడం సరి కాదు. గత ప్రభుత్వం మా ఊరి పక్క నుంచి ట్రిపుల్ ఆర్ పోతుందని చెప్పారు. కానీ పక్కనే ఉన్న మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి భూమిలో నుంచి రోడ్డు వెళ్లకుండా కొత్తగా మార్కింగ్ వేయించారు. నాకు ఉన్న 20 గుంటల భూమితో పాటు రెండేళ్ల కిందట గ్రామంలో నిర్మించుకున్న ఇల్లు కూడా రోడ్డులో పోయేటట్టు కనిపిస్తున్నది.

**- సుధాకర్, రైతు అంతారం**



రంగారెడ్డిజిల్లా చేవెళ్ల మండలం అంతారంలో ట్రిపుల్ ఆర్ ఏర్పాటులో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న రైతులు

### సీఎం స్పందించి రైతులకు న్యాయం చేయాలి



*గతంలో ఖానాపూర్ గేట్ నుంచి ఆలూరు మధ్యలో ట్రిపుల్ ఆర్ పోతుందని చెప్పారు. ఇప్పుడు అంతారం మధ్యలో నుంచి రోడ్డు పోతుందని చెబుతున్నారు. నాకు ఉన్న 32గుంటల భూమి పోతుంది. మేము దీనిమీద ఆధారపడి బతుకుతున్నాము. నేను కూడా గత 18 సంవత్సరాలుగా హోంగార్డుగా పనిచేస్తున్నాను. కుటుంబాన్ని పోషించుకోవడానికి వచ్చిన జీతాలు సరిపోవడం లేదు. కనీసం ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదు. పక్కనే మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి భూమి ఉంది. ఆయన భూమిలో నుంచి కొంచెకూడా పోలేదు. పక్కనే ఉన్న రూ. కోట్లు విలువచేసే విల్లాస్ నుండి భూమి పోలేదు.*

***- నర్సింహులు, హోంగార్డు, అంతారం***



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం అంతారంలో ట్రిపుల్ ఆర్ ఏర్పాటులో తన ఇల్లు పోతుందని చూపిస్తున్న బాధిత రైతు

### భూమి, ఇల్లు రెండూ పోతాయి




*రింగ్‌రోడ్డు వేస్తే నా ఇల్లు, భూమి రెండూ పోతాయి. నాకున్న 10 గుంటల భూమిలో అందులోనే ఇల్లు కట్టుకున్నాను. ముందున్న కేసీఆర్ ప్రభుత్వం మా ఊరి అవతలి నుంచి రింగ్‌రోడ్డు పోతదని చెప్పింది. ఇప్పుడు మా ఊరిలో నుంచి పోతుందని గుర్తులు పెట్టారు. మా ఊరు పక్కకు ఉన్న రంజిత్‌రెడ్డి దాంట్లో నుంచి ఒక్క గుంట కూడా పోతలేదు. మాకున్న జరంత భూమిలో నుంచి రోడ్డు పోతే మేము ఎలా బతకాలి. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.* ***- బేగరి మల్లయ్య, రైతు అంతారం***

### రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం



ట్రిపుల్ ఆర్ పేరిట ప్రభుత్వం పేద రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. గత ప్రభుత్వంలో ఆలూరు వైపు నుంచి రోడ్డు వేస్తామని చెప్పారు. ఇప్పుడు అక్కడి నుంచి 500మీటర్లు పక్కకు జరిపి మా గ్రామం అంతారం మీదుగా రోడ్డు వేసేందుకు గుర్తులు పెట్టారు. దీంతో రైతుల భూములతో పాటు ఇం డ్లు కూడా పోతా యి. రైతులకు నష్టం కలిగిస్తే ఆందోళనకు దిగుతాం.


**- నరేందర్, అంతారం**



### పేద రైతులకు న్యాయం చేయాలి

*రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయడంలో తమ గ్రామానికి ఎంతో నష్టం జరుగుతుంది. అధికారులు వచ్చి మార్కింగ్ వేసి వెళ్లారు. అప్పటి నుంచి మా భూములు, ఇండ్లు పోతాయని అందరం ఆందోళన చెందుతున్నాము. నాకున్న ఐదు గుంటల భూమి రోడ్డులోనే పోయేటట్టుంది. కూలి పనులు చేసుకుని కష్టపడి భూమి కొనుకున్నాను. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. పాత మార్కింగ్ ప్రకారం రోడ్డు వేస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.*


***- జుట్టు సుధాకర్, రైతు అంతారం***



### నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

*ట్రిపుల్ ఆర్ కోసం మా భూములు పోతే మేము నష్టపోతాం. మా ఊరికి ఇరువైపులా ఉన్న మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి భూములు గానీ, మరో పక్కన ఉన్న విల్లాస్ భూములు కాకుండా అంతారం, హస్తేపూర్ గ్రామాలకు సంబంధించి సుమారు 300 ఎకరాల వరకు రైతుల భూములకు నష్టం జరుగుతుంది. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, పునరాలోచించాలి. ప్రభుత్వ భూముల మీదుగా రోడ్డేయాలి.*

***- వెంకటేశ్, అంతారం***



### రెండు ప్లాట్లు రోడ్డులో పోతున్నాయి

*పెద్ద నాయకుల భూములను పక్కన పెట్టి పేదవారి భూముల్లో నుంచి రోడ్లు వేయడం సరికాదు. నాకున్న రెండు ప్లాట్లు రోడ్డులో పోతున్నాయి. ప్రస్తుతం భూముల ధరలు కోట్లల్లో ఉన్నాయి. రింగ్ రోడ్డు వస్తే భూములకు మరింత ధరలు పెరుగుతాయని మేము ఆశతో ఉంటే, ఉన్న భూముల్లో నుంచే రోడ్డు పోతే మా పరిస్థితేంటి? ప్రభుత్వం స్పందించి రోడ్డును ఊరు పక్కన నుంచి నిర్మిస్తే బాగుంటుంది.*

***- నవీన్, అంతారం***



### రైతులకు నష్టం కాకుండా చూడాలి

*ట్రిపుల్ ఆర్ వేస్తే మాకు ఇబ్బందేమీలేదు. కానీ మాకున్న కొద్దిపాటి భూముల్లో నుంచి రోడ్డు వేస్తే నష్టం జరుగుతుంది. గ్రామంలో పెట్టిన గుర్తుల ప్రకారం చూసుకుంటే నా భూమి మూడు ఎకరాల వరకు పోతుంది. ఇక్కడ ఎకరం ధర రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు నడుస్తున్నది. రింగ్‌రోడ్డు కోసం మన్నెగూడ మీదుగా రోడ్డు పోతే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. మా భూములకు నష్టం జరుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.*


***- పెంటయ్య, రైతు అంతారం***



### రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి

*ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ ఏర్పాటు చేస్తున్న తరుణంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుంగా చర్యలు చేపట్టాలి. గ్రామంలో ఎకరం, అర ఎకరం భూములు ఉన్న రైతులు చాలామంది ఉన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలి. అలాంటి రైతుల భూముల్లో నుంచి రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తే వారికి ఎంతో నష్టం జరుగుతుంది. రైతుల భూములను దృష్టిలో ఉంచుకుని రోడ్డు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.*

***- మాణిక్యం, అంతారం***



### నాకున్న ఐదు గుంటలు పోతుంది

*రీజినల్ రింగ్ రోడ్డుతో మా గ్రామస్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. నేను పదేండ్లు కష్టపడి గ్రామంలో 5 గుంటల భూమి కొనుగోలు చేశాను. ఇప్పుడు ట్రిపుల్ ఆర్ పేరుతో నాకున్న ఐదు గుంటలు రోడ్డులో పోయేలా ఉంది. వందల ఎకరాల భూమి ఉన్న పెద్దవారి భూములు పోకుండా మాలాంటి పేద రైతుల భూముల్లో నుంచి రోడ్లు వేస్తే మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. ప్రభుత్వం ఆలోచించి రైతులకు న్యాయం చేయాలి.*

***- వీరాంజనేయులు, రైతు అంతారం***